బాబోయ్ దొంగలు

- నర్సరీలపై దొంగల దాడి
- రాత్రిపూట మొక్కలు మాయం చేసేవారు కొందరు
- రైతులు లేనప్పుడు చేలల్లో మొక్కలు పట్టుకుపోయేవారు మరి కొందరు
- రూ.లక్షల్లో నష్టపోతున్న నర్సరీ రైతులు



కడియపులంకలో రైతుకు తెలియకుండా మొక్కలు తీసుకువెళుతున్న వాహనం



ప్యాకెట్లలో టెర్మినేలియా వెరిగేటా మొక్కలను మాయం చేసిన దొంగలు

కడియం: దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన కడియం ప్రాంత నర్సరీలపై దొంగల దాడి కొనసాగుతోంది. ఎక్కువ ధర పలికే మొక్కలు, గింజలను దొంగిలించడంతో పాటు నర్సరీల్లో రైతులు లేని సమయంలో మొక్కలు పట్టుకుపోతున్నారు. విలువైన మొక్కలను పాకెట్లలోంచి పీక్కుని మరీ పట్టుకుపోతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపితే నర్సరీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. అయితే సీసీ కెమెరాలు ఉన్న నర్సరీల నుంచి మొక్కలను ధైర్యంగా మాయం చేసేస్తుండడంతో రైతులకు ఏమీ పాలుపోవడం లేదు.

కొత్త ట్రెండ్

సాధారణంగా విలువైన వస్తువులను దొంగతనం చేయడం తెలిసిందే. అయితే నర్సరీల్లో రైతులు ఆరుగాలం శ్రమించి పెంచిన మొక్కలను కూడా దోచుకుపోవడం ఇప్పుడు కలకలం రేపుతోంది. కడియం మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో దాదాపు 15 వేల ఎకరాలకుపైగా నర్సరీ రంగం విస్తరించి ఉంది. ఈ నర్సరీల్లో వేలాది రకాల పండ్లు, పూలు, అలంకరణ మొక్కలను రైతులు పెంచుతుంటారు. వీటిని కొనుక్కునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి కూడా కొనుగోలుదారులు వస్తుంటారు. జూన్ నుంచి మొదలయ్యే మొక్కల అమ్మకాల సీజన్ జనవరి వరకూ కొనసాగుతుంది.

కొత్త మార్గాలు

కడియం ప్రాంత నర్సరీల్లో మొక్కలు ఎత్తుకుపోయేవారు ఎప్పటికప్పుడు సరికొత్త పంథాను అనుసరిస్తున్నారు. ముందుగా మొక్కలను చూసుకునేందుకు నర్సరీలకు వస్తున్నారు. ఆ తరువాత మధ్యాహ్నం రైతులు లేని సమయంలో ఆ మొక్కలను వాహనాల్లో లోడు చేసుకుని పోతున్నారు. కడియపులంక ప్రాంతంలో ఈ నెల 1వ తేదీన రైతులు చేలో లేని సమయంలో వేలాది రూపాయలు విలువైన మొక్కలను చెప్పాపెట్టకుండా లోడుచేసి తీసుకుపోయారు. వాహనం సీసీ కెమెరాలో పడడంతో వాటిని పోలీస్‌లతో పాటు, సోషల్ మీడియాలో సైతం పెట్టి దొంగల ఆచూకీ కోసం రైతులు ప్రయత్నిస్తున్నారు. జూన్ నెలాఖరులో కడియం మండలం దుళ్ల నుంచి మురమండ వెళ్లే రోడ్డులో దాదాపు 400 టెర్మినేలియా మెంటాలికా వెరిగేటెడ్ రకం మొక్కలను పాకెట్లలో ఉన్నవి లాక్కుని మరీ పట్టుకుపోయారు. వీటి విలువై సుమారు లక్ష రూపాయలకు పైనే ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఘరానా మోసం

మరో రకం దొంగలు కొత్త రకం మోసానికి తెరతీస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే లిమిట్ అయిపోయిందని కొన్న మొక్కలకు సంబంధించిన సగం డబ్బులను మాత్రమే రైతు బ్యాంకు ఖాతాకు పంపిస్తున్నారు. మిగిలిన సొమ్ములు రేపు పంపిస్తామని మొక్కలు పట్టుకుపోతున్నారు. కొన్నవారి నెంబర్ ఉంది, సగం డబ్బులు వేసేసారు.. మిగిలినవి కూడా వేసేస్తారులే అనే నమ్మకంతో రైతులు వారిని వెళ్లనిస్తున్నారు. అయితే నర్సరీ దగ్గర నుంచి వాహనం వెళ్లిపోతే ఇక సదరు ఫోన్ నంబర్‌కు ఎన్నిసార్లు కాల్ చేసినా ఫోన్ ఎత్తకపోవడం గానీ, సదరు నంబరు పనిచేయకపోవడం గానీ జరుగుతోందంటున్నారు. దీంతో సగం డబ్బులను రైతు నష్టపోవాల్సి వస్తోంది. ఇలా మోస పోయిన వారంతా నర్సరీ అసోసియేషన్‌ను ఆశ్రయిస్తుండడంతో, స్వయంగా నర్సరీ అసోసియేషన్ తరఫున సోషల్ మీడియా గ్రూపుల్లో ఇలా ముక్కూమొహం తెలియని వారికి అరువుపై మొక్కలు ఇవ్వొద్దని, కొనుగోలుదారుల వివరాలు పూర్తిగా తెలిస్తే మాత్రమే అమ్మకాలు సాగించాలని రైతులను హెచ్చరిస్తున్నారు. ఇంకొందరైతే రైతుల దగ్గర మొక్కల కొనుగోలు డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో పాటు, రైతుల నుంచి ఎదురు డబ్బులు కూడా తీసుకుని పరారవుతున్న ఘటనలు కూడా ఉన్నాయంటున్నారు. ఏది ఏమైనా మొక్కలు కొనేందుకు వచ్చేవారి వివరాలు తెలిస్తే తప్ప అరువు ఇవ్వకుండా ఉంటేనే రైతు కష్టం ఇలా మోసగాళ్ల పాలు గాకుండా ఉంటుందని పోలీస్‌లు చెబుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నర్సరీల్లో చోరీలు, ఇతర మోసాలను అరికట్టేందుకు నర్సరీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రైతులను కోరుతున్నాం. వీటి ద్వారా నేరం జరక్కుండా ఉండడంతో పాటు, ఒక వేళ నేరం జరిగితే కేసు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. రైతులు అప్రమత్తతతోనే మోసగాళ్ల బారిన పడకుండా ఉండగలుగుతారు.

– ఏ.వెంకటేశ్వరరావు, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్

పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలంలో నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, వర్షపు నీరు రోడ్డు మీద నిల్వ కుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నిర్మించబోతున్న స్టామ్ వాటర్ డ్రెయిన్‌ను వేగంగా పూర్తి చేసి, త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆమె సోమవారం ఆర్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలసి వీరభద్రపురంలో పర్యటించారు. అక్కడ క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు వీరభద్రపురం హనుమాన్ టెంపుల్ నుంచి సీతంపేట పబ్లిక్ టాయిలెట్స్ మీదుగా కృష్ణా నగర్ ప్రగతి ఫర్నిచర్ షోరూం వరకు రూ.1.95 కోట్ల అంచనాతో చేపడుతున్న స్టామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనుల వివరాలను కలెక్టర్‌కు వెల్లడించారు. కలెక్టర్ వెంట ఎస్ఈ కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

24న వినియోగదారుల వేదిక

కడియం: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి జేపీబీ నటరాజన్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని కడియం సెక్షన్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.రాజబాబు, స్వతంత్ర్య సభ్యులు ఎస్.మురళీకృష్ణ హాజరవుతారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని నటరాజన్ కోరారు.

పీజీఆర్ఎస్‌కు 9 అర్జీలు

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, అర్జీదారునికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డివిజన్ స్థాయి అధికారులతో కలసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి 9 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో చోటు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి వెంకటగిరికి చెందిన తనుబుద్ధి సూర్యభాస్కరరావును బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, కాతేరుకు చెందిన స్వామి సూర్య కిరణ్‌ను జిల్లా కార్యదర్శిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర నియమించారు. ఈ సందర్భంగా సూర్య భాస్కరరావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసి, పార్టీ అభివృద్ధికి కృషి చేసే ప్రతి కార్యకర్తకూ పదవులు లభిస్తాయన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు బీజేపీ నాయకులు అభినందించారు.

సిమెంట్ బెంచీల వితరణ



బరియల్ గ్రౌండ్‌కు బెంచీలు బహూకరించిన గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం టిడ్కో గృహాల సమీపంలోని బరియల్ గ్రౌండ్‌కు స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు సిమెంటు బెంచీలను బహూకరించారు. వీటిని సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముద్దాల తిరుపతిరావు (అను), ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజయోనాతో కలిసి ఆయన.. నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు, రాజాయోనా మాట్లాడుతూ నగరంలో అనేక పార్కులు, హౌసింగ్ బోర్డ్ సచివాలయాలు, బస్టాండ్ దగ్గర స్వర్ణాంధ్ర తరఫున బెంచీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బెంచీలు అందజేసినందుకు బరియల్ గ్రౌండ్ నిర్వాహకుడు బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

కంబాలచెరువు: మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనల మేరకు కళాశాలలో విభూతి ఉమా శంకర్ కళాజాత బృందం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా బుర్రకథ ఏర్పాటు చేశామన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, వాటిని వినియోగించిన వారికి విధించే శిక్షలను బుర్రక్రథ రూపంలో వివరించారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామమూర్తి, సహాయ ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, ఈగల్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ జల్లా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తును సర్వనాశనం అవుతుందని శ్రీమతి జాస్తి బుల్లెమ్మాయి మహిళా కళాశాల ట్రెజరర్ చిట్టూరి వెంకట్ అన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపు మేరకు సోమవారం ఆ కళాశాలలో బుర్ర కథ ద్వారా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జె.రమాదేవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. గోదావరి కవి డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ భవితవ్యం యువత పైనే ఆధార పడి ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ తులసి, కేవీ స్వామి, అధ్యాపకులు దుర్గాభవాని, సుందరి, మనోహర్, అశోక్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: తన భర్త ఇంటిలో గొడవపడి ఎవరికీ చెప్పకుండా సోమవారం తెల్లవారుజామున వెళ్లిపోయాడని బొమ్మూరు మురళీకొండ ప్రాంతానికి చెందిన గుత్తుర్తి హేమ అపర్ణ.. బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరు మురళీకొండకు చెందిన 31 ఏళ్ల గుత్తుర్తి శివకుమార్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తుంటాడు. కుటుంబ సభ్యులతో గొడవపడి అందరూ నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివకుమార్ ఆచూకీ తెలిసిన వారు 94407 96533 (సీఐ), 94911 22811(ఎస్సై)నంబర్లకు తెలియజేయాలన్నారు.

బ్రిడ్జికౌంటీలో కనీస సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

సీటీఆర్ఐ: గైట్ కాలేజీ సమీపంలో మినీ అమెరికా పేరుతో నిర్మించిన టౌన్ షిప్‌లో హామీ ఇచ్చిన మేరకు సౌకర్యాలను వెంటనే కల్పించాలని బ్రిడ్జికౌంటీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. దశాబ్ద కాలమైనా, కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. స్థానిక గణేష్ చౌక్ లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు సీఎస్ మహాదేవ్, సెక్రటరీ సీహెచ్ ఏసుదాసు, ట్రెజరర్ రామకృష్ణ, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010లోనే ఇక్కడ విల్లాలు, అపార్టుమెంట్లు నిర్మించి, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒప్పందం ప్రకారం రెండేళ్లలోనే నిర్మాణాలు పూర్తి చేసి, సౌకర్యాలు కల్పించి అప్పగించాల్సి ఉందన్నారు. ఐదేళ్లు దాటిపోయినా పూర్తి చేయకపోవడంతో బిల్డర్‌తో పోరాటం చేసి, చివరకు ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

శ్రీనివాసరావు కార్టూన్‌కు బహుమతి



గుత్తుల శ్రీనివాసరావు



బహుమతి పొందిన శ్రీనివాసరావు కార్టూన్

కడియం: విశాలాక్షి మాసపత్రిక 16వ వార్షికోత్సవం సందర్భంగా మామిడిపూడి రామకృష్ణయ్య స్మారకంగా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ గుత్తుల శ్రీనివాసరావు ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు నెల్లూరులో బహుమతిని ప్రదానం చేశారు. ఆ వివరాలను శ్రీనివాసరావు సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. నేడు చాలా మంది యువత తమ తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకోకుండా, తమ బాధ్యతల్ని పట్టించుకోకుండా సినీనటుల మీద మితిమీరిన అభిమానం పెంచుకుని, ఎలా దిగజారిపోతున్నారో తన కార్టూన్‌లో సెటైరికల్‌గా చూపించానన్నారు. కాగా.. వృత్తి రీత్యా చదరంగ శిక్షకుడిగా పనిచేస్తున్న శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న విజయవాడ డివిజన్ ఉద్యోగులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్ల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ చేతుల మీదుగా 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డు' అందుకున్నారు. జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి సోమవారం విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటుగా సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో వర్చువల్ పద్ధతిలో భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా అన్ని సెక్షన్లలో సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం విజయవాడ డివిజన్‌లో విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన సామర్లకోటలోని టీటీఐ డీవీకేఎస్‌పీ చైతన్య, రాజమహేంద్రవరంలోని ట్రైన్ మేనేజర్ కె.పాపారావుకు అవార్డులు అందజేసి అభినందించారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ అధికారి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పోసికుమార్ తదితరులు

ధవళేశ్వరం: దివ్యాంగుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి ఏవై శ్రీనివాస్ అన్నారు. ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముత్యాల పోసి కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల, వృద్ధుల సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల హక్కుల వేదిక నిరంతరం పోరాడుతూ ఉంటుందన్నారు. అత్యాచారానికి గురైన దివ్యాంగ మహిళల విషయంలో సెక్షన్ 92ఏ అమలు కావడం లేదన్నారు. దీని పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవల్లి భరత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మానసిక దివ్యాంగులపై జరిగిన అత్యాచార సంఘటనలకు సంబంధించిన బాధితులను తక్షణమే పరామర్శించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల వేదిక మహిళా అధ్యక్షురాలు బసవబోయిన దుర్గ, రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేవీఆర్ సాగర్, దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ఆదం పకీర్, ఏఐడీఆర్ఎఫ్ అర్బన్ నియోజకవర్గం ఇన్‌చార్జి సబ్బెళ్ల విజయ దుర్గారెడ్డి, దివ్యాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ రాజు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ గణేష్

ధవళేశ్వరం: శక్తి యాప్‌తో మహిళలకు భద్రత కలుగుతుందని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శక్తి యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్, వాట్సాప్ నంబర్‌పై అవగాహన కల్పించారు. యాప్‌ను ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లనవసరం లేకుండానే శక్తి యాప్ ద్వారా డయల్ 112కు ఎస్ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్ నేరాలు, మోసాలు , మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి తెలిసిన వెంటనే డయల్ 112కు టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై హరిబాబు, ఎస్‌బీ ఏఎస్సై శుభాకర్, శక్తి టీమ్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక సంహిత డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ ల్యాబ్ పోలీసులు మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకొని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్, స్కైప్‌లో అపరిచితులతో చాటింగ్ చేయవద్దన్నారు. అనవసర లింక్‌లు, అప్లికేషన్లను క్లిక్ చేయడం వల్ల పలు అనర్థాలు కలుగుతాయన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. అలాగే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైం.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వైవీ సురేష్, డి.మహేష్, ఒకటో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆకలి కేకలు



మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో విధులు బహిష్కరించిన బొమ్మూరు పంచాయతీ కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఇలాఖాలో పంచాయతీ కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకటో తేదీనే పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లిస్తామని బుచ్చయ్య బహిరంగంగానే ఓకార్యక్రమంలో చెప్పినప్పటికీ ఎక్కడా ఆచరణలో అమలు కావడం లేదు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మూరు గ్రామపంచాయతీ కార్మికులకు గత మూడునెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. దీంతో కార్మికులు కుటుంబాలను పస్తులుంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక పక్క తీసుకున్న అప్పులు చెల్లించలేక, మరో పక్క కుటుంబాలను పోషించలేక సతమతమవుతున్నారు. గ్రామంలో కూటమినేతలు ఉన్నప్పటికీ కనీసం కార్మికులకు జీతాలు ఇప్పించే పరిస్థితి కూడా లేదు. జిల్లా కలెక్టరేట్, ఇతర జిల్లా కార్యాలయంలో ఏ కార్యక్రమం జరిగినా ఈ కార్మికులు సేవలు వినియోగించుకుంటారే తప్ప..వారి జీతాలు గురించి జిల్లా అధికారులు సైతం పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పంచాయతీ కార్మికులు చేసేది లేక గత మూడురోజుల నుంచి విధులను బహిష్కరించారు. గతంలో రూరల్ మండల గ్రామ పంచాయతీలకు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేకాధికారిగా ఉన్నారు. ఆయన బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి నగరపాలకసంస్థ కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ ఉన్నారు. ఆమె ఇప్పుడు గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్నారు. జిల్లాకలెక్టర్ బొమ్మూరు గ్రామపంచాయతీ కార్మికులు జీతాలను మంజూరు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని బొమ్మూరు గ్రామప్రజలు కోరుతున్నారు.

శాకంబరిగా బాలాత్రిపుర సుందరి



ధవళేశ్వరం: గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైన బాలాత్రిపుర సుందరి అమ్మవారు సోమవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చిన భక్తులు.. అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరింపులు

రాజమహేంద్రవరం రూరల్: తనను ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరించి, తన చేతిలో సెల్‌ఫోన్ లాక్కుని పోయాడని హుకుంపేట రామకృష్ణ నగర్‌కు చెందిన 19 ఏళ్ల యువతి సోమవారం సాయంత్రం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. రామకృష్ణ నగర్‌కు చెందిన 19 ఏళ్ల యువతికి ఆదర్శ నగర్‌లో ఉండే సమయంలో బొడపర్తి మణికంఠతో పరిచయం ఉంది. ఆ తర్వాత యువతి కుటుంబ సభ్యులు రామకృష్ణ నగర్‌కు ఇల్లు మారారు. మణికంఠ ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో అతడికి ఆ యువతి దూరంగా ఉంటుంది. అయితే జూన్ నెల నుంచి వెంటపడి ప్రేమించాలని ఇబ్బంది పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె వద్దకు వచ్చి, ప్రేమించాలని లేకపోతే చంపేస్తానని బెదిరించాడు. చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయాడు. యువతి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జోరు వర్షం.. వీధులు జలమయం



అరవింద్ నగర్ ప్రాంతంలో పరిస్థితి



నీట మునిగిన కోనేరు పేట ప్రాంతం



మోరంపూడి సబ్‌స్టేషన్ ప్రాంతంలో వర్షం నీరు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరం, రూరల్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోరంపూడి జంక్షన్‌లోని ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డు, కోనేరు పేట, అరవింద్ నగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, వీఎల్ పురం, శ్యామల సెంటర్, ఫ్రీడమ్ పార్కు, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాలలో మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయింది. దాదాపు రెండు గంటల పాటు నగరంలో పలు ప్రాంతాలు జలమయంలోనే ఉన్నాయి.